# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-09-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- "వికసిత్ భారత్" లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.
- రాష్ట్రంలో ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు రావాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ముఖ్యమంత్రి రేపు ఉత్తరాంధ్రకు విడుదల చేయనున్నారు.
- రాష్ట్రంలో ఎస్.ఐ.ఆర్. గడువును ఈనెల 10వ తేదీ వరకు పెంచుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది.

========================

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ విజయవాడలో ఈరోజు జరిగిన ఐఆర్‌సీఎస్ 2024-25 వార్షిక సర్వసభ్య సమావేశంలో వివిధ జిల్లాల కలెక్టర్లకు రెడ్‌క్రాస్ అవార్డులను అందజేశారు. పలు మానవతా సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు వనరులను సమీకరించడంలో సహకారం అందించినందుకు గాను బాపట్ల, కృష్ణా, నెల్లూరు, కాకినాడ, పశ్చిమగోదావరి, నంద్యాల, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లను గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ... 7 జిల్లాల పరిధిలో మూడేళ్లుగా 8 కోట్ల 50 లక్షల రూపాయలతో 'మీ ఇంటికి మీ డాక్టర్' పథకం కింద 5 లక్షల కుటుంబాలను దత్తత తీసుకుని రెడ్‌క్రాస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భారతదేశం 100 సంవత్సరాల స్వాతంత్ర్య ఉత్సవాలను జరుపుకునే సమయానికి వికసిత్ భారత్, స్వర్ణ ఆంధ్ర@2047ను నిర్మించడంలో యువత కీలక పాత్ర పోషించాలని గవర్నర్ సూచిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

========================

పేదల ఆర్థిక పరిపుష్టి కోసమే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో ఆయన ఈరోజు పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, వివిధ కేటగిరీల వారికి పెన్షన్లను పెంచి ఇస్తున్నామన్నారు. 73 వేల 507 కోట్ల రూపాయలను పెన్షన్ల రూపంలో పేదలకు ఇచ్చామని, అభివృద్ధితో పాటు సంక్షేమమూ ముఖ్యమనే ఉద్దేశ్యంతోనే పెన్షన్లను అందిస్తున్నామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను అందిస్తూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. గడచిన రెండేళ్లలో లక్షా 50 వేల కోట్ల రూపాయలను సంక్షేమం కోసం ఖర్చు చేశామని, పేదలను ఆర్థిక సాధికారిత దిశగా తీసుకెళ్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు రావాలన్నదే తమ ఆకాంక్ష అని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకెన్లు)

========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు రేపు విడుదల చేయనున్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద ఆయన రెగ్యులేటర్ ఆన్ చేసి గోదావరి జలాలకు జల హారతి ఇచ్చి స్వాగతం పలకనున్నారు. దీని ద్వారా 4 జిల్లాల్లోని వివిధ ఆయకట్టు పరిధిలో మొత్తం 2 లక్షల 87 వేల 320 ఎకరాలకు సాగునీరు, 5 లక్షల 23 వేల మందికి తాగునీరు లభిస్తుందని మొగల్తూరులో ఈరోజు జరిగిన సభలో ముఖ్యమంత్రి వెల్లడించారు. ఏలేరు, పంపా, తాండవ, వరాహ, శారద నదులను దాటుకుంటూ ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర వైపుగా వెళ్తాయని, క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాలను అధిగమిస్తూ.. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నిర్మాణం జరిగిందని చెప్పారు. కృష్ణా, గోదావరి, వంశధార నదులను అనుసంధానం చేస్తామని, భవిష్యత్‌లో గోదావరి-కావేరి నదులను అనుసంధానం చేసి దక్షిణ భారతదేశంలో నీటి సమస్య లేకుండా చేస్తామని చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా తెలియజేశారు.

విరామం

========================

రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) గడువును ఈ నెల 10వ తేదీ వరకు పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. అలాగే.. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారానికి అక్టోబర్ 5వ తేదీ వరకు అవకాశం ఇచ్చింది. అక్టోబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది.

========================

రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ముఖ్యమంత్రితో కలసి ఈరోజు ఆయన పంపిణీ చేశారు. అనంతరం మొగల్తూరులో జరిగిన సభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ.. దీపం పథకం కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడం, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వంటి నిర్ణయాలు మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. చేనేత, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు సహా అర్హులైన అన్ని వర్గాలకు పింఛన్లు అందిస్తూ.. ప్రభుత్వం అండగా నిలుస్తోందని శ్రీనివాస వర్మ వివరించారు.

========================

సమగ్ర ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం, పారిశ్రామిక వర్గాలు సమన్వయంతో ముందడుగు వేయాలని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. చెన్నైలో ఈరోజు జరిగిన దక్షిణ భారతదేశ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (SICCI) 116వ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2047 వికసిత్ భారత్ లక్ష్యాలు ఎంఎస్ఎంఈల బలోపేతంతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈల పురోగతికి అనుకూల వాతావరణం ఉందన్న మంత్రి.. వీటి కోసం పారిశ్రామిక పార్కుల ఏర్పాటు చేశామని, ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ఇండియా - ఈయూ ఒప్పందం, ఎన్ఆర్ఐల సహకారంతో స్థానిక పరిశ్రమలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని మంత్రి వివరించారు.

========================

పౌరులకు ప్రభుత్వం అందించాల్సిన సేవలన్నీ ఎలాంటి అంతరాయం లేకుండా ఆన్‌లైన్ లోనే అందుబాటులో ఉండేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సీఈఓ ప్రఖర్ జైన్ అన్నారు. ప్రభుత్వం కొత్తగా రూపొందిస్తున్న ఏపీఐన్ మొబైల్ అప్లికేషన్ యాప్ వినియోగంపై అధికారులకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన 2 రోజులు కార్యశాలను అమరావతిలో ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వ సేవలను ప్రజలు తాము ఉన్నచోటు నుంచే పొందేలా చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ప్రజలకు ఒక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో `ఆర్టీజీఎస్ ఏపీఐన్` అనే మొబైల్ యాప్‌ను తీసుకొస్తోందని, ప్రజలు తమకు కావాల్సిన అన్ని సేవలను సులభంగా పొందేలా దీన్ని రూపొందించామని చెప్పారు. ఏపీఐన్ యాప్ ద్వారా ప్రజలు ప్రభుత్వ సేవలను వినియోగించుకునేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.

========================

ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెవెన్యూ శాఖలో పెద్ద ఎత్తున సంస్కరణలు అమలు చేస్తోందని ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు గ్రామంలో ఆయన ఈరోజు 22A విమోచన స్ఫూర్తి సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వ చొరవ, గ్రామ ప్రజల సంకల్పంతో వట్టిచెరుకూరు గ్రామంలో 120 ఏళ్ల భూ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు.

========================
========================